
ఆ ఒక్కరోజు
ఆమె అందాన్ని
దోచుకున్నబోడిగుండు
ఆమె జీవితాన్ని
నందనవనం చేసింది
ఎలా....?



# మలుపుల్లో మంచీ చెడ్డా!

"వర్తమాన సినీ నటి కుమారి శిరీషను నిన్న రాత్రి పదిగంటలకు తన స్వగృహంలో వ్యభిచారం నేరం క్రింద అరెస్టు చేశారు ప్రముఖ దర్శకుడు శ్రీ కీర్తి ప్రసాద్ ద్వారా పందొమ్మిది వందల డెబ్భయి ఎనిమిదిలో ఈవిడ సినీప్రవేశం చేసింది. ఇంతవరకూ పాతిక చిత్రాల్లో నటించిన కుమారి శిరీష వయస్సు ముప్ఫయి సంవత్సరాలు

ఆపైన చదవలేక పేపర్‌లో అచ్చయిన శిరీష ఫోటోను చూస్తుండిపోయాను. నైట్ గౌన్‌లో, నిర్లక్ష్యంగా, నిర్లజ్జగా చూస్తూ నిలబడి వుంది చిన్నగా నిట్టూర్చి, పేపర్ని ప్రక్కన పడేశాను

యేళ్ళతరబడి పట్టిపీడుస్తున్న జాడ్యం వదిలినట్టు అనుభూతి కలుగుతుంది అర్థంగాని వికృత తృప్తి ఆవరిస్తుంది. హఠాత్తుగా మస్తిష్కపు పొరల్లో మరో మెరుపు ఘోరమైన ఊహకి ఆపాదమస్తంగా వణుకుపుట్టింది భగవాన్ ! ఒహవేళ అలా జరిగితే భరించేవాడేనా ? నెవర్ "

మనిషికి తన జీవితకాలంలో ఎప్పుడో ఒకప్పుడు కొన్ని ముఖ్యమైన మలుపులు సంభవిస్తాయి అవి వారి వారి కర్మానుసారం ప్రాప్తిస్తాయో ఏమోగానీ, వాటివల్ల కొందరి జీవితాలు నందనవనమైతే కొందరివి ఉన్మత్త పుష్పాలవుతాయి

గోడమీద వేంకటేశ్వరస్వామి పటం. దానికి క్రిందగా దండలు వ్రేలాడదీసిన అమ్మా నాన్నల ఫోటోని చూస్తుంటే, ఆలోచనలు రివర్స్‌గేర్‌లో నడిచాయి



"అమ్మా! తిరుపతి వెళ్ళడానికి శుక్రవారంనాడు టికెట్స్ రిజర్వ్ చేశాను" అన్నాను అమ్మచేతికి టికెట్స్ యిస్తూ. చెల్లాయి గీత నన్ను మింగేసేలా చూస్తోంది.

"అమ్మా! మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను. నేనుమాత్రం గుండు కొట్టించుకోను. ఆపైన మీ యిష్టం!" తెగేసి చెప్పింది చెల్లాయి.

"అలా అనకూడదే పిచ్చి మొహమా! మొక్కుకున్నాక తప్పకుండా తీర్చాలిందే. తలదేముంది యిట్టే పెరిగిపోతుంది" అనునయంగా అన్నది అమ్మ.

"ఆ పనేదో మీరే చెయ్యండి. నేనేం మొక్కుకోలేదు" అరిచినంత పని చేసింది చెల్లాయి.

తప్పమ్మా! కళ్ళుపోతాయ్!" లెంపలేసుకుంటూ అంది అమ్మ!

"కళ్ళుపోవు. గుండు కొట్టించుకుంటే వున్న అందం కాస్తా పోతుంది" చెల్లాయి అవస్థ చూస్తుంటే నవ్వాగడంలేదు. నవ్వితే గిచ్చి తిట్టి మీదపడి కరిచినంత పని చేస్తుంది.

అసలీగొడవంతా నాన్నగారివల్లవచ్చింది. ఆయన కామెర్లు విపరీతంగా జబ్బుచేయడంతో, అమ్మ బెంబేలుపడి నాన్నగారికి నయమయితే యింటిల్లిపాది తిరుపతొచ్చి తలనీలాలు సమర్పిస్తానని మొక్కుకుంది. మొక్కు ఫలితమో, డాక్టర్ చేతిచలవో, మొత్తానికి ఆరునెలలకే నాన్నగారు బాగయ్యారు. "పదండి తిరుపతి" అంటూ అమ్మ హఠం వేసుక్కూర్చుంది.

"ఒరేయ్! నువ్వన్నా చెప్పరా అమ్మతో!" అంటూ నా దగ్గరకు వచ్చింది చెల్లాయి.

పొందికగాని మా చెల్లాయి కాలేజీ బ్యూటీగా పేరుపొందింది కాని అమ్మ ఆజ్ఞకి తిరుగులేదని నాకు తెలుసు. పోతే, మద్దతో మొరపెట్టుకుంటుందంతే!

"అయినా నీకేం నష్టం? ఆపదమొక్కుల దేవుడికి తలనీలాలు యిస్తే మంచిదేగా? పైగా శాస్త్రరీత్యా ఆరోగ్యకరం కూడాను!" అన్నాను.

"అది కాదురా! గుండు చేసుకుని కాలేజీకి ఎలా వెళ్ళేది? అందుకని..." అంటూ నసగడం మొదలుపెట్టింది.

చెల్లాయి ఆంతర్యం ఏమిటో నాకు తెలుసు. వచ్చే నెలలో మాకాలేజీవాళ్ళు ఓ లేడీస్ క్లబ్ సంయుక్తంగా 'అందాల పోటీ' నిర్వహిస్తున్నారు. దానికి జడ్జిగా సినీ దర్శకుడు కీర్తిప్రసాద్ వస్తారు. అదీగాక ఆయన కొత్తగా తీయబోయే చిత్రానికి సరైన కథానాయిక కోసం గాలిస్తున్నారట. బహుశా ఈ అందాలపోటీలో నెగ్గిన వాళ్ళకా అవకాశం రావచ్చు.

చెల్లాయికి సినిమాపిచ్చి కాస్త ఎక్కువగానే వుంది. చిన్నప్పటి నుండి గారాబంగా పెరగడంవల్ల పైపెచ్చు అందంగావుండడం వల్ల యిట్లో ఏమీ అనేవారు కారు. ఈ పోటీని ఎనౌన్స్‌చేసినప్పటి నుండి, అందం, ఆరోగ్యంపట్ల మరింత శ్రద్ధ వహిస్తూ, పోటీకోసం ఎదురుచూస్తుండగా, ఈశ్వరేచ్ఛ అన్యథా వుండి, జోడిగుండు అవాంతరం ఎదురయింది. అమ్మ చాలా పట్టుదలగా వుంది. ఇలాంటి విషయాల్లో చెల్లాయి ముద్దుపనికిరాదు నాన్న యిలాటివి పట్టించుకోడు. అమ్మ గీసిన గీటును

దాటని అవతారపురుషుడు!

"మాట్లాడవేంరా?" గుసగుస్తూ అడిగింది చెల్లాయి

"నన్నేం చెయ్యమంటావే! అమ్మ సంగతి నీకు తెలుసుగా!" అన్నాను.


"అర్థమైందిరా. నువ్వొట్టి స్వార్థపరుడివి. నేను పోటీలో పాల్గొంటే నీ సీతకు బహుమతి రాదు. అదేగా నీ ఏడుపు" కాలికి మెడకీ లంకె పెట్టి అరిచింది చెల్లాయి.

[illegible]మన్నాను. ఇంకాసేపు అక్కడుంటే చరిత్రంతా త్రవ్వి చేతికిస్తుందని 'ఏడిశావులే' అని బయటికి ఉడాయించాను.

చెల్లాయి అంత అందగత్తె కాకపోయినా సీత కూడా బాగానే వుంటుంది. మా యిద్దరి ప్రేమ వ్యవహారం చెల్లాయికి తెలుసు. సీత అందాల పోటీలో పాల్గొంటానని అంటే కాదనలేకపోయాను. అందుకే చెల్లాయి యిలా ముడి పెట్టి, తప్పంతా నాదన్నట్టు అంటుంది

గుండు ఉపద్రవం తప్పించుకోడానికి చేతనైన ఫీట్స్ అన్నీ చేసింది చెల్లాయి. తిండి మానేయడం, అలగడం, గ్లాసులు పగలేయడం వగైరా ఇండియన్ ట్రిక్స్‌ని ప్రయోగించింది. ఫలితం లేకపోగా, మరిన్ని చీవాట్లుమాత్రం దొరికాయి

ఆఖరికి ఎలాగైతేనేం తిరుపతి వెళ్ళాం నా జీవితంలో మరిచిపోలేని అనుభవం అది కల్యాణకట్టలో చెల్లాయి దిక్కుమాలిన ముఖం వేసుకుని, బలిపశువులా కూర్చుంది. మంగలివాడు చెల్లాయి చక్కటి, పొడవాటి జడనిట్టురు మెచ్చుకుంటూ, తన చేతుల ద్వారా కేశఖండన మహత్తర కార్యం జర



గడం తన మహద్భాగ్యంగా మురిసిపోతూ, శుభ్రంగా తన నైపుణ్యాన్ని చూపించాడు మూడు రూపాయలు దక్షిణ తీసుకుని.

అమ్మ చెల్లాయి బుగ్గలు నిమురుతూ, "పిచ్చిదానా! ఎంత? రెండ్రోజుల్లో తల పెరిగిపోదూ!" అన్నది.

"బొరసానిలా వున్నావే!" అన్నాను నా గుండె తడుముకుంటూ. నిర్వేదంగా నాకేసి చూసింది చెల్లాయి. అంతులేని వైరాగ్యంతో మునిగిపోయిన వేదాంతులు సరిగ్గా అలాగనే చూస్తారు!

దైవదర్శనం అయ్యాక ఇంటికొచ్చాం. వారం రోజులవరకూ కాలేజీ ముఖం చూడలేదు చెల్లాయి. తర్వాత అలవాటుపడి తలకి 'స్కార్ఫ్' కట్టుకుని కాలేజీకి వెళ్ళేది.

పదిహేను రోజులు గడిచాయి. స్టూడెంట్స్ ఎదురుచూసే అందాలపోటీ ఆనాడు ప్రారంభమైంది. అమ్మాయిలు అందం పేరిట అడ్డమైన అలంకరణలతో ఆపసోపాలు పడుతున్నారు. అబ్బాయిలు వాళ్ళను ఆకర్షించడానికి మరింత హైరానా పడుతున్నారు.

సినీ దర్శకుడు కీర్తిప్రసాద్ బెల్లం కొట్టిన రాయిలా బిగుసుకుపోయి ముఖంలో ఎలాంటి భావాల్నీ ప్రదర్శించక, మార్కులు వెయ్యడానికి పాడ్ పట్టుకుని కూర్చుని వున్నాడు.

పోటీ ఆరంభమైంది.

ఒక్కొక్క అమ్మాయి వేదికమీద కొచ్చి, నడకలు వంకర్లు పోతూ, వయ్యారాలు ప్రదర్శిస్తూ అందాల్ని ప్లస్ అంగాంగాల్ని ప్రదర్శించడంలో తమ తమ తెలివితేటల్ని చూపిస్తున్నారు. గంటన్నర తర్వాత పోటీ ముగిసింది. తదనంతరం 'లెసీ' సినిమాలు తియ్యడానికి అలవాటుపడ్డ కీర్తిప్రసాద్ 'లెస్త్రీస్పీచ్' ఇచ్చి, ఆఖర్న జడ్జిమెంట్ యిచ్చాడు. అందాల సుందరిగా సీత ఎన్నికయింది.

అభినందనల వర్షంలో తడిసిపోతోంది సీత. నాకు ఒకప్రక్క ఆనందం కలిగినా మరోప్రక్క చెల్లాయిపై జాలి కలిగింది. చెల్లాయిగానీ ఈ పోటీలో పాల్గొని వుండే, తీర్పు ఎలావుండేదో! చూడ్డానికి రమ్మన్నా ససేమిరా రానుపొమ్మంది చెల్లాయి ముసుగు తన్ని పడుకుంటూ!

కరతాళ ధ్వనుల మధ్య సీత వేదిక మీద నిలబడి విజయగర్వంతో అందరినీ చూసింది. కీర్తిప్రసాద్ స్వహస్తంగా కిరీటంతో సీతను అలంకరించాడు. వెంటనే సీత కీర్తిప్రసాద్‌కు పాదాభివందనం చేసింది. చప్పట్లు ఈలలు మిన్నంటాయి. "తెలివైన అమ్మాయ్" అనుకున్నాను. ఆరోజు ఎంత ప్రయత్నించినా సీతను అభినందించడానికి అవకాశం లభించలేదు.

ఓ పది రోజులు నాకూ సీత పేరు మార్మోగిపోయింది. మా 'లవ్ ఎఫైర్' తెలిసిన వాళ్ళు నాకేసి ఈర్ష్యగా చూస్తుంటే, కించిత్ గర్వం కలిగింది నాకు.

సరిగ్గా పరీక్షలు వారం వుందనగానే సీత కాలేజీకి రావడం మానేసింది. కీర్తిప్రసాద్ గారు తీసే కొత్త చిత్రంలో కథానాయికగా సీతను బుక్ చేశారట. షూటింగ్ కోసం మద్రాసు వెళ్ళిందని వాళ్ళ బామ్మగారు ముక్కు చీదేస్తూ చెప్పింది. నాకేమిటోలా అనిపించి యింటికొచ్చేశాను.

పరీక్షలయ్యాయి. నేను ఎం.ఎ.తో బయట పడితే, చెల్లాయి బి.ఎస్సీలో కూర్చుంది. దేవుడి దయవల్ల చెల్లాయికి అనుకోకుండా ఓ చక్కటి సంబంధం వచ్చింది. అబ్బాయి ఇంజనీర్, స్టేట్స్‌లో ఉద్యోగం. ఖాయమైందతనికి. అత్యంత వైభవోపేతంగా వివాహం జరిగింది. పెళ్ళయిన నెల్రోజులకే చెల్లాయి భర్తతో 'స్టేట్స్'కి వెళ్ళి సెటిల్ అయిపోయింది.

సీత చెల్లాయి పెళ్ళికన్నా వస్తుందేమోనని ఆశతో ఎదురుచూశాను. నాలుగైదు ఉత్తరాలు కూడా రాశాను. జవాబురాలేదు. రెండు నెలల తర్వాత ఊరకు వచ్చిందని తెలిసి వెళ్ళి కలిసాను. ఇన్నాళ్ళూ ఒక్క ఉత్తరమైనా రాయనందుకు క్షమాపణ చెబుతుందేమోనని ఎదురుచూశాను. మామూలుగా పలకరించి, ఎలా వున్నావని కొత్త వ్యక్తిని విచారించినట్టు అడిగింది. మాట్లాడినంతసేపూ తన షూటింగ్ అనుభవాలు, తనెలా మొదట టేక్‌లోనే డైరెక్టర్ చేత శబ్బాష్ అనిపించుకున్నది వగైరా విషయాల్ని చెబుతుంటే, విసుగొచ్చి "మన పెళ్ళి సంగతేమంటావ్?" అని నిలదీసి అడిగాను. క్షణకాలం నాకేసి తదేకంగా చూసి, చూపులు మరల్చుకుంటూ—

"ఐయామ్ సారీ మురళీ! ఇప్పుడిప్పుడే సినీఫీల్డులో ప్రకాశించాను. భవిష్యత్తులో మంచి నటినవుతానన్న ఆత్మవిశ్వాసం నాలోవుంది. ఇలాంటప్పుడు పెళ్లి పెటాకులంటే నా యిమేజ్ దెబ్బతింటుంది"

---



## కొత్త

ఫుల్‌గా తాగి బార్‌నుండి బయటకు వచ్చారు సర్వోత్తం, పురుషోత్తం.

"అది మీ ఇంట్లో లైటా మా యింట్లో లైటా" అడిగాడు సర్వోత్తం ఆకాశంలోని చందమామని చూపిస్తూ.

"నాకూ అర్థం కావడంలేదు" అయోమయంగా అన్నాడు పురుషోత్తం.

అంతలో అటుగావస్తున్న ఓ వ్యక్తిని ఆపి "ఆ వెలుగుతున్న లైటు ఎవరింట్లోది" అనడిగారు.

"ఏమోనండి! నేనీ వూరికి కొత్త" అంటూ తూలుతూ వెళ్ళిపోయాడా వ్యక్తి.

—యం. రజనీ శకుంతల (హైదరాబాద్)

అన్నది సీత

ఈ జవాబు నేనూహించిందే! సినీ జగత్తులో కాలూనడంతోటే ఆ సినీభాష కూడా వచ్చేస్తుంది కాబోలు ఇక మరీ బుర్ర పాడు చేసుకోడం అనవసరం అనిపించి, 'ఆల్ ద బెస్ట్' అని వచ్చేశాను

సీత జవాబు చెల్లాయికి తెలియచేస్తే. తను చాలా బాధపడుతూ నన్ను ధైర్యం తెచ్చుకోవాలని రాసింది.

చిన్నగా నవ్వుకున్నాను

ఇలాంటి వాటికి డీలాపడి, గెడ్డాలు అవీ పెంచేసి, పిచ్చాడిలా తిరిగే వాజమ్మను కాను నేను. ప్రేమాగీమా అన్నీ బూటకాలనిపించింది డబ్బూ,హోదా, పేరు...వీటి కోసం ఎలాంటి వాటినైనా పరిత్యజించగలదు మనిషి. అట్టే బుర్ర పాడు చేసుకోకుండా, ఉద్యోగం వేటలో పడి, రైల్వే జాబ్‌లో స్థిరపడ్డాను.

నెల్లాళ్ల తర్వాత సీత నటించిన చిత్రం విడుదలైంది

సినిమాతో సీత పేరు శిరీషగా మారింది ఏమాటకామాటే చెప్పుకోవాలంటే సీత అద్భుతంగా నటించింది. ఆ చిత్రం విజయం పొందడంతో వరసగా ఆరు చిత్రాల్లో సీత బుక్ అయింది.

ఉద్యోగం దొరికిన మరుసటి సంవత్సరమే శైలజతో నా వివాహం జరిగింది. క్రమంగా సంసార బంధంలో పడిపోయాను అప్పుడప్పుడు తెరమీద నటిన్ని చూస్తున్నాను. పత్రికల్లో గాసిప్ కాలమ్స్‌లో సీతగురించి ఏమిటేమిటో రాసేవారు.

ఐదేళ్ళు గడిచాయి

గుమ్మడిపండులాంటి పిల్లాడికి తల్లయింది చెల్లాయి.

మా ఇంట్లో చెల్లాయిలాంటి పాప వెలిసింది

"ఒరేయ్ నా కోడలు జాగ్రత్తరా! ఏ లోటూ రానీయకు" అంటూ ఉత్తరాలు రాసేది చెల్లాయి

గుండెజబ్బుతో అమ్మ మరణించడం నాన్నగారికో పెద్దషాక్! ఆ షాక్ నుండి తేరుకోలేక సంవత్సరం తిరక్కుండానే ఆయనా కాలం చేసారు. చెల్లాయి సంవత్సరానికొకసారి వచ్చి, నెలరోజులు మాతో గడిపి వెళ్ళేది

కాలం కరిగిపోతూనే వుంది.

సినీఫీల్డులో చాలామంది నూతన నటీనటులు రావడంతో సీతకు బుక్కింగులు తక్కువై, తెర మరుగున పడింది

ఏ సినిమా పత్రికల్లోనూ సీత పేరు కనిపించటం లేదు. సినిమాఫీల్డ్ ఒక అంద మైన అంధకారంలో కూరుకుపోయిన వాళ్ళు ఎంత ప్రయత్నించినా బయటకు రాలేరు. నచ్చిన బ్రతుకు లేదు.

పాపం సీతను మర్చిపోయే స్థితిలో పేపర్లో సీత ఫోటో ఆక్సిడెంట్ వివరాలు చూసేసరికి గతంఅంతా అస్పష్టంగా కళ్ళముందు కనిపించింది.


*

నాటి చెల్లాయి పెళ్ళి ఫోటో! పరిపూర్ణ స్త్రీత్వానికి ప్రతీకగా, కళకళ లాడుతున్న చెల్లాయి ప్రక్కన హుందాగా బావ. ప్రక్కన వాళ్ళ అనురాగానికి చిహ్నమైన బాబు. ఎంత చక్కటి సంసారం. అదృష్టం వున్న వారికి అన్నీ అలా సమకూరు తాయి.

సీతను తలచుకుంటె నాకు జాలి వేస్తుంది. భవిష్యత్తును రకరకాల రంగుల్లో ఊహించుకుని రొంపిలో పడింది.

ఆనాడు జరిగిన అందాల పోటీలో చెల్లాయి కూడా పాల్గొని వుంటే, అందాల సుందరిగా ఎన్నికైవుంటే, సినిమాల్లో నటించి వుంటే......ఓహ్...ఊహించ డానికే ఒళ్ళు జలదరిస్తుంది. కలలోకూడా, పొరపాటుగా నైనా అలాంటి మలుపుల్ని ఊహించలేను. ఆ 'నెగిటివ్ థాట్'ని భరించే శక్తి నాకు లేదు.

గోడమీద వేంకటేశ్వరస్వామి పటం నాకేసి చిద్విలాసంగా చూస్తున్నట్టుంది ✱



## ముఖ్యమంత్రుల రికార్డులు

మోహన్‌లాల్ సుఖాడియా రాజస్థాన్ రాష్ట్రానికి పదిహేడు సంవత్సరాలపాటు (మధ్యలో అయిదు వారాలు మాత్రం పదవిలో లేరు) ముఖ్యమంత్రిగా చేసి...అతి ఎక్కువ కాలం ఆ పదవిలో ఉన్నవ్యక్తిగా రికార్డు స్థాపించారు. ఒకే టరమ్‌లో రెండు పార్టీలను రిప్రజెంట్ చేస్తూ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనత ఒక్క భజన్‌లాల్‌కే దక్కింది. 1978లో జనతాపార్టీ ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన భజన్‌లాల్ 1980లో కాంగ్రెస్ (ఐ) ముఖ్యమంత్రిగా ప్లేటు ఫిరాయించారు. మూడుసార్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన అజయ్‌కుమార్ ముఖర్జీ మొత్తం మీద రెండు సంవత్సరాలు మాత్రమే ఆ పదవిలో ఉన్నారు. మన రాష్ట్రంలో పనిచేసిన ఏడుగురు ముఖ్యమంత్రులలో ఆరుగురు విచిత్రమైన పరిస్థితులలో పదవినుండి తప్పుకోవటం కూడా ఒక రికార్డే!

—జూపిటర్